ఇలాంటివి యెన్నయామో!

కప్పగంతుల సత్యనారాయణ

౧

ఆవి దసరాపండుగలు. ఆనాడు మహర్నవమి. దసరా వేడుకలకల్లా విజయనగరాన్ని చెప్పి యింకో వూరిపేరు చెప్పాలి. అందులోనూ కృష్ణరాయని ప్రభుత్వం. ఆంధ్రభోజుడుకదూ. కత్తికి కలానికీకూడా సన్మానం లభించినరోజు లవి. మహర్నవమినాడు పండితుల్నీ, విజయదశమినాడు శూరుల్నీ పరీక్షజేసి వారివారి తాహతుకొద్దీ బహుమానా లిచ్చేవాడు రాయలు. పండగతొమ్మిదిరోజులూ నిరతాన్నదానం జరిగేది. ఆవేడుక మళ్లా ఆంధ్రదేశంలో జరగదు. అలాంటిప్రభువు యేదేశంలోనూ—యేమో. ఆరోజు ఉదయంనించి మధ్యాహ్నంవరకు పండితసన్మానము. సాయంత్రం ఊరేగింపు. వందలకొద్దీవస్తారు పండితులు. అందర్నీ వినటానికి రాయలకి తీరుబడి అవుతుందా? అందువల్ల ఓయేర్పాటు జేశాడు. ఉన్నారుగా అష్టదిగ్గజాలూనూ. వారిని నియమించాడు. మహర్నవమికి ముందు యెనిమిదిరోజులూకూడా వచ్చినవారి సంగర్నీ వినవలసిన భారమూ, వారందర్నీ తరగతివారీగా యేర్పరుచు భారమూ అష్టదిగ్గజాలదే. బహుమానాలుమాత్రం మహర్నవమినాడు స్వయంగా యిస్తాడు రాయలు.

తెల్లవారేటప్పటికి రాయలు అభ్యంజనము చేయించుకొని, శుభ్రవస్త్రాలు ధరించి కూచున్నాడు. తిరుమలరాజు దర్శనార్థం వచ్చాడన్నారు పరిచారికలు. లోపలికి రమ్మనమని సెలవైంది. చిరునగవుతో, ఎగురుతున్న గిరజాలజుట్టుతో, సేనానాయకుడి దుస్తులతో లోపలికి వచ్చాడు తిరుమలరాజు. బంగారపు రేకులు చుట్టిన కోళ్లుగల మంచంమీద తనపక్కనే కూచోమన్నాడు రాయలు. తిరుమలరాజు రాయలికి అల్లుడు.

'నీకోసమే చూస్తున్నాను. అందరు ప్రభువులూ వచ్చేశా రనుకుంటాను' అన్నాడు రాయలు మెల్లగా.

'అవును. అప్పాజీ మిమ్మలను వీలైనంత త్వరలో దయచేయమన్నారు. ఈసంవత్సరం చాలాశోభాయమానంగా వున్నాయి దసరారోజులు' అన్నాడు తిరుమలరాజు.

'వచ్చేదసరాకేనా రాయచూరు మనం గెలిచి, ఆప్రభువు మనసభకి రాకపోతే మనకి తృప్తిలేదు. పూర్వాన్నించీ మనదై మధ్య వాళ్లకిపోయింది. అక్కడకూడా మన జెండా యెగిరితే మనకాలం శాంతంగా గడుపుకోవచ్చు. అందరికీ తగిన విడుదులు—'

'చిత్తం. అందరూ విడుదులలో సంతోషంగానే వున్నారు. అయినా వాళ్లమీద ఓకన్నుంచమనే చెప్పాను వేగువాళ్లకి.'

'ఏది యెలావున్నా సైన్యంమాత్రము యెప్పుడూ సిద్ధంగా వుండాలి. పండగరోజులు మనం యేమరి ఉన్నామని ఆదిల్‌శాహ—'

'వాడికి గుండెలు లేవు. మనం వెళ్లి మీదబడితే స్వసంరక్షణ చేసుకోవాలిగాని, ఎదిరివచ్చేంత ధైర్యము యేం జూసుకొని—'

'ఇంక లేద్దాము' అని రాయలు లేచి శిరోవేష్టమును పెట్టుకోగా తిరుమలరాజుకూడా లేచాడు.

సేవకులు గుఱ్ఱాన్ని తీసుకొనివచ్చి ప్రాకారముంగో పెట్టారు. దర్వాజావద్దర అంగరక్షకులు వారి గుఱ్ఱాల కళ్ళాలు చేతబట్టుకొని నిలుచున్నారు. రాయలు వచ్చి గుఱ్ఱాన్ని యెక్కినతరువాత తిరుమలనాయకుడుకూడా యెక్కాడు. వీరిప్రక్కన ఆరుగురు ఆరుగురు అంగరక్షకులు వాళ్లవాళ్ల గుర్రాల్ని యెక్కారు. అందరూ సభామంటపానికి బయలుదేరారు. మేడలమీంచి పూలూ, దండలూ విరివిగా రాయలపైన బడుతున్నాయి. విలిచినవి నిలుస్తున్నాయి, రాలిపోయినవి రాలిపోతున్నాయి. సభామంటపం దగ్గిరకి వెళ్లి గుఱ్ఱందిగి మంటపంలోకి వెళ్ళాడు రాయలు.

జయజయధ్వానములు మిన్నుముట్టుతూండగా రత్న సింహాసనముమీద కూర్చున్నాడు. తర్వాత సభికు లంతా కూచున్నారు. సభ కిటకిటలాడుతూవుంట. నానాదేశాల్నించి ప్రభువులూ, పండితులూ వచ్చి ఉచితాసనములపై కూచున్నారు.

పండితసన్మాన మారంభమైంది. సమస్తపండి తులకీ తగురీతిని బహుమానాలు దొరికాయి. అల్లసాని పెద్దన్నగారి వంక తిరిగి రాయలు 'అయిపోయినట్లేకదా' అన్నాడు. పెద్దన్నకూర్చొనియే 'చిత్త' మన్నాడు. అప్పు డొకయువకుడు లేచి నిలుచుని, రాయలకు వంగి నమస్కరించగా 'ఏమి' అన్నట్లు కనుబొమ లెగుర వైచాడు రాయలు.

'మాది యేలినవారి పాలనలోనే కొండపల్లి. కవి త్వములో కొంచెం ప్రవేశ ముంది. జన్మ క్షత్రియుణ్ని కావడంచేత యుద్ధములోకూడా—'

'పరశురామునికి వ్యతిరేకంగా' అన్నాడు రాయలు మందహాసంతో.

'చిత్తం. ఉదయమే వచ్చాను. పరీక్షించి ప్రభువువారు నాకూ యెన్నిక యివ్వాలి.'

ఆంధ్రకవితాపితామహునికేసి రాయలుచూడగా 'అబ్బాయీ, వసంతకాలాన్నీ, కోయిలనీ వేరువేరుగా వర్ణించు నాయనా' అన్నాడు అల్లసానిపెద్దన్న, రాయలయభిమతాన్ని గురుతించి. రెండేపద్యాలు, ఒకటి చంపకమూ, ఒకటి శార్దూలమూ. పదినిమిషములలో పైకప్పుకేసి చూస్తూ ఆలోచించి చదివాడు. తెనాలి రామలింగడు సెభాస్ అనడంతోటే సభంతా సెభాస్ అన్నారు.

'ప్రభువుగారి వదనము చూడ్డంతోటే నిరక్షర కుక్షికికూడా కవితామతల్లి యాలవడునప్పుడు, నావిషయ మంత ప్రశంసనీయము కాదు' అన్నాడు యువకుడు వినయగర్భితంగా.

'నామధేయము' అని రాయలు అడుగగా 'రామ చంద్రు డంటారండి' అని జవాబు చెప్పాడు.

'రేపు వీరులకు బహుమానము లియ్యబడును. అక్కడికికూడా రావచ్చును.'

'చిత్తము'

'అప్పాజీ, యితనిని విడిదికి పంపుడు.'

యథావిధిగా సభ పూర్తియయింది. అందరూ లేచారు. తిమ్మరుసుఆజ్ఞచే భటుడు రామచంద్రుని విడిదికి తీసికెళ్లాడు.

*   *   *   *

మరునాడు ఆయుధవిద్యాపరీక్షలో రామచం ద్రుడు ప్రథముడగుట రాయ లాతనిని కడుంగడు ప్రశం సించి, తనసేనయం దైదువందల సైనికులపై నాయకత్వ మొసంగుటయు నాదిగాగల వార్తలు పురమంతయు వ్యాపించెను.

౨

రాయలు కొండపల్లిని లోబరుచుకొన్నతరు వాత ఆప్రజలంతా రాయలకి విశ్వసనీయులై ఉన్నారు. చాలామంది రాయలకొలువులోగూడా జేరి, భక్తి తాత్పర్యములతో అతన్ని సేవిస్తున్నారు. కత్తిబట్టడం చేతనైనవాడు రాయలవద్దకి వెళ్లాడంటే నిరుద్యోగియై పోవడం ఎప్పుడూజరగలేదు. అందులో, సాములో అస మానప్రతిభగల రామచంద్రుడు అయిదువందలసేనకి నాయకు డయినాడంటే ఆశ్చర్య మేమీ లేదు.

రామచంద్రుడు కొండపల్లిలో ఒకసామాన్య క్షత్రియకుటుంబానికి చెందినవాడు. అతని తండ్రి గజపతికొలువులోవుండి రాయలమీద కత్తికట్టినవాడే. గజపతిపని అయిపోయినతరువాత, యుద్ధజీవితాన్ని విరమించుకున్నాడు. రామచంద్రుడు చిన్నతనంనించీ అసాధారణమేధావియేకాక మంచి బలశాలికూడాను. గాలికెగిరే గిరజాలజుట్టు, వస్తూవస్తూవున్న నల్లటి మీసాలు, మెలిదేరిన కండలుగలిగిన చేతులు, అడుగున్నర వెడల్పుగల రొమ్ము, తూచినట్లున్న యవయవములు— వీటితో చక్కనిరూపము రామచంద్రునిది. సునిశిత మైన బుద్ధీ, వినయమూ అతనికి మరీ వన్నెదెచ్చాయి.

క్రిస్టోవాడ్డేఫిగండో అనేవాని యాధిపత్యము క్రింద కొంతమంది పోర్చుగీసువాళ్లని రప్పించి వారిచే తన సైన్యానికి క్రమశిక్ష నిప్పించేవాడు రాయలు.

రామచంద్రునికూడా రోజూ వెళ్లి ఒకమాసంరోజులు నేర్చుకోమని సెలవైంది.

ఓరోజు చాలాసేపు కవాతుచెయ్యడంచేత మధ్యాహ్నం భోజనము కాగానే పడుకుని నిద్ర పోయాడు. లేచేప్పటికి సాయంత్రము పొద్దుపోయింది. కొలువుకు పోవటం చాలించి, ఊరు చూద్దామని ఉళ్లోకి వెళ్లాడు. రెండుమూడుబజారులు తిరిగి విసుగు పుట్టి చల్లగాలేనా తగులుతుందని ఊరిబయటనున్న తోటలోకి వెళ్లాడు. అలాంటితోటలు విజయనగరంలో మూడే ఉన్నాయి—ఒకటి ఊళ్లో నట్టనడుమనూ, ఇంకోటి రాయలమందిరంచుట్టూనూ — అందులోకి మాత్రం యెవర్నీ పోనియ్యరు. రామచంద్రుడు వెళ్లిన తోట ఊరిబయటవుంది. సాధారణంగా ఎవరూరారు ఆ తోటకి. తుంగభద్రానది ఆతోటలోంచే ప్రవహిస్తుంది. నదియొడ్డున కూర్చున్నాడు రామచంద్రుడు.

అలలతోటి యేదో లాక్కుపోతూన్నట్టు కొట్టుకుపోతూన్న ప్రవాహాన్నీ, మధ్యమధ్య తళుక్కుని మెరుస్తూ యెగిరే చేపల్నీ, వాటిని పట్టుకుందుకు రివ్వున వాలే పిట్టలనీ చూస్తూ కూచున్నాడు, రాయని వైభవాన్ని తలుచుకొంటూ వొక్కడూ నదివొడ్డున.

'అమ్మయ్యో, బాబోయి, పోయెపోయె' అని ఓదానివెంబడి ఓటిచొప్పున రక్షణార్థము కేకలు వినబడ్డాయి. క్షత్రియరక్తము పొంగగా మెరుపుమెరిసినట్టు లేచి నాలుగుదిక్కులూచూశాడు. నదిలో, తనకి పైవాలున నీళ్లల్లో ఒకవ్యక్తి రెండుబుటకలు వేసింది. ఒడ్డున ఒకస్త్రీ అటూయిటూ తిరుగుతూ కేక లేస్తోంది. ఒక్కవుదుటున అక్కడికి పోయి నదిలోదూకి మూడు మునకలలో ఆ జీవిని పట్టుకుని సందిట్లో అదుముకొని ఒక్కచేత్తోటి యీదుతూ ఒడ్డుకు వచ్చాడు. ఇంకా నీళ్లలో రెండుగజాల్లో ఉండగానే ఒడ్డున విలపిస్తూన్న స్త్రీ, మునిగిపోయిన స్త్రీని (బయటికితీసినతరువాత తెలిసింది) పట్టుకొని పైకి తీసికెళ్లింది. రామచంద్రుడు స్త్రీపొట్టనొక్కి నీళ్లన్నీ కక్కించాడు.

'త్వరగా యింటికి తీసికెళ్లి పొడిగుడ్డలు కట్టాలి. లేకపోతే జబ్బుచేస్తుంది' అన్నాడు.

'అలాగే. తోటబయట మాసేవకుడూ, బండివాడూ ఉన్నారు. నేను పోయి పిలుచుకుని వస్తాను. మీరు చూస్తూవుండండి' అని ఆ స్త్రీ వెళ్లిపోయింది. రామచంద్రుడు క్రింద కూచుని తన తొడమీద ఆ స్త్రీతల పెట్టి, మొహంమీద పడిన వెంట్రుకలన్నీ తోసేసి, బుగ్గలు నిమురుతూ ఆమెసౌందర్యాన్ని చూస్తున్నాడు. గుండెలకి వెచ్చతనం కలుగుతుందని తనచేతుల్ని గుండెలమీద పెట్టాడు. ఇంతలోకి ఆమెకి కొంచెం తెలివివచ్చి మెల్లగా కళ్లుతెరిచి, తనకేసి చూస్తూన్న రామచంద్రుడిని చూసి, సిగ్గుతో, చనిపోయిన తనకి యిలా జరుగుతోందేమోనని, లేవబోయి నీరసంతో వెనక్కి పడిపోయింది.

'ఫరవాలేదు. అలా కొంచెంసేపు పడుకుంటే సత్తువ వస్తుంది' అన్నాడు రామచంద్రుడు. తడిసిపోయిన తన గుడ్డల్నీ, తానున్న తోటనీ చూచి, తన నిజస్థితి గ్రహించుకొని, తన్ను మరణమునుండికాపాడిన యువకునకు మానసికనమస్కారము లర్పించి 'వసంత యెక్కడ' అని సిగ్గుతో, నీరసంగా, చలిచే వణకుతూ అడిగింది.

'మీబండివాడిని తీసుకురావడానికి వెళ్లింది. వస్తూంటారు యీపాటికి' అన్నాడు బుగ్గలు నిమురుతూ. ఆస్పర్శకి శరీరమంతా పులకించి, ఆనందంతో కళ్లుమూసేసింది. ఇంతట్లోకి యిరువురు మనుష్యులతో వసంత వచ్చి రామచంద్రుని జూచి 'తెలివిరాలేదా' అని అడిగింది. ఆమాటకు జవాబియ్యకుండానే, రామచంద్రుడు ఆమె శిరస్సు కిందనుంచి, తను లేచి నిలుచున్నాడు. 'అమ్మా ముక్తాంబా, యిటు జూడు తల్లీ' అని వసంత యామెను పలకరించగా ముక్తాంబ కళ్లుతెరిచి చూసింది. రెండు చుక్కలు కళ్ల వెంబటి కారాయి. 'ఎందుకుతల్లీ' అని ఆమెతలను తన తొడలమీద పెట్టుకొని, రామచంద్రుని వైపు తిరిగి 'అయ్యా, యివ్వాళ మీరు మాకు చేసిన వుపకారము విలువలేనిది. ప్రాణదాత లగు తమ నామము మాముక్తాంబతో నేమని చెప్పుదును?' అని కృతజ్ఞతాపూర్వకంగా అడిగింది వసంత.

'రామచంద్రు డంటారు నన్ను. రాయలవారి కొలువులో ఉన్నాను.'

'కొండపల్లినుంచివచ్చినది మీరేనా?'

'అవును. మీరుకూడా ఎవరో చెప్పితే—'

'ఈమె యీపట్టణాధికారి గోపాలరాజుగారి కుమార్తె. నేనామెచెలిని.'

'ఒంటరిగా యిలా రావడంచాలాసాహసం. నదిలోదిగటంమరీని—'

'దాహము త్రాగుచు కాలుజారిపడిపోయినది. కాని మీరు చేసిన సహాయము మాత్రము.'

'పదిసార్లు అలాఅంటే నాకు సిగ్గుగావుంది. ఇంక యింటికివెళ్లండి.'

ఇంతసేపూ రామచంద్రునివైపు రెప్ప వెయ్యకుండా చూస్తున్న ముక్తాంబ కనులు మూసింది. రామచంద్రుడు వెళ్లిపోయాడు. వసంతను ఆనుకొని ముక్తాంబనడిచి, సేవకులిద్దరూ వెనకాల వస్తూండగా, బండిదగ్గరకి వెళ్లి లోపలికి ఎక్కింది. వసంతకూడా ఎక్కగా బండి తోలుకొని వాళ్లు యింటికి తీసికొని పోయినారు.

"ప్రాణదాతలను తమనామమును......అని కృతజ్ఞతా పూర్వకంగా అడిగింది వసంత."

3

రెండురోజులు గడిచాయి. రామచంద్రుడికి మనస్సు ఎలా స్తిమితంగా లేదో, ముక్తాంబకికూడాఅలాగేవుంది. ఇద్దరి హృదయాల్లోనూ భయమూ, సిగ్గూ, ఎలా కలుసుకుందామా

అనే ఆతురతా నెలకొనివున్నాయి. రామచంద్రుడు రోజూ తోటకివెళ్లటము మొదలుపెట్టాడు. పదిరోజులు గడిచిపోయాయి యిలాగే. వాళ్లుమాత్రం తోటలో అత నికి మళ్లీ కనపడలేదు.

పదకొండోనాడు మధ్యాహ్నం భోజనంచేసి కూచున్నాడు. ఎవరో స్త్రీ వచ్చిందని సేవకుడు చెప్పగా లోపలికి రానియ్యమన్నాడు. కొంచెం సేపటికి ముక్తాంబస్నేహితురాలు వసంత వచ్చింది లోపలికి.

'ఏం విశేషం?' అన్నాడు.

'ఆరోజునుంచీ మళ్లా మీదర్శనం కాలేదు.'

'నేనూ అలాగే అనుకుంటున్నాను. తోట లోకి వస్తారేమోనని—'

'నదిలో పడ్డప్పటినించీ, ఆతోటకి వెళ్లవద్దని వాళ్ల నాన్నగారు కోప్పడ్డారు. మీనివాసం కను క్కోడం దుర్ఘటమైంది.'

'.....................'

'మీతో ఒకసారి మాట్లాడవలెనని మాముక్త—'

'నాకూ అలాగే వుంది. వీలు?'

'నేను కలుగజేస్తాను.'

'నే నీయూరికి క్రొత్తవాడను. రాజానుగ్రహము కోరివచ్చినవాడను. బయటపడిందంటే ఏమవుతుందో ఆలోచించావా?'

'అన్నిటికీ నే నున్నాను. మీకు ఏవిధమైన యిబ్బంది కలిగినా నాప్రాణం తీసెయ్యండి.'

'.....................'

'రేపు మాయింటిప్రక్కన వున్న యింటికి రండి, ప్రొద్దుగూకేవేళకి.'

'సరే.'

తనయింటిగుర్తులు చెప్పి తప్పకుండా రావాలి అని బాసచేయించుకొని వసంత వెళ్లిపోయింది.

*　　*　　*　　*

'మిమ్మల్ని చూసినప్పటినుంచీ—'

'నాకూ అలాగే వుంది.'

'నాప్రాణాన్ని మీరు రక్షించారు.'

'పదేపదే ఆమాట—'

'పొరపాటుకాదు. నన్ను చెప్పనియ్యండి.'

'సరే, చెప్పు.'

'మీరు నాప్రాణాన్ని రక్షించారు. కనక మీరు నాప్రాణదాతలు. మీరురక్షించినది మీరేఅనుభవించాలి. నేను మీకు కృతజ్ఞత ఎలా తెలియజెయ్యాలో—'

'నీప్రాణాన్ని నా కిచ్చెయ్యడమే!'

'అంతకన్న యింకేమీ నేను యివ్వలేను కాని—'

'ఏమిటి కాని?'

'పుచ్చుకోటంలో మీరు మనస్ఫూర్తిగా—'

'ఎంత వెఱ్ఱిదానవు. ఇవ్వడం పుచ్చుకోడం నీనాచేతులలోనే వుందనుకొంటున్నావు. నీతలిదండ్రు లున్నారు. నాతలిదండ్రులు నామాటకి, నాకోర్కెకి అడ్డుచెప్పరుకాని—'

'నాతండ్రి యడ్డుచెప్పినను భయము లేదు.'

'అంతధైర్యము—అపాయకరము.'

'ఆయనమాట సాగదు. చిన్నాదేవి మహారాణికి నామీద చాలప్రేమ, స్నేహము. ఆమెకాళ్లమీద పడ తాను. ఆమెమాట రాయలువారు జవదాటరు. రాయల వారి మాట విననంతశక్తి మాతండ్రికి లేదు.'

'పెద్దయెత్తే. అయినా నాకు సందేహంగానే వుందికాని మనస్సుమాత్రం నీమీదపూర్తిగా—'

'నాకు అస్తమానమూ మీవూసే'

'ఏదీ ఒక్కసారి'

'ఇప్పుడొద్దు. అంతా సరిపడాలి.'

'ఏం సరిపడాలి? నీమనసూ, నామనసూ సరి పడనేపడ్డాయి.'

'అబ్బా!'

'.....................'

'...............'

'ఇంక వెళ్లనా?'

'మళ్లా యెప్పుడు?'

'మీరు ఎప్పుడు రమ్మంటే అప్పుడు. శరీరమే నాదికాని, మనస్సు మీదే.'

'శరీరముహూడా నాదే.'

౪

రాయ లమితాగ్రహాపరవశుడై యుండెను. త్రిమ్మరుసు మంత్రికొరకు కబురు పంపబడెను. ఆయన వచ్చుసరికి రాయలు ఇరువదిసారులు ఛీత్కార మొనరించుటయు, ఊర్పులు నిగుడించుటయు, రెండు మూడుపర్యాయములు మీసముల మెలివైచుటయు, నాలుగైదుసారులు కత్తిపైకి చెయ్యి పోనిచ్చుటయు కూడ జరిగియుండెను. త్రిమ్మరుసు వచ్చి యుచితాసనమున గూర్చుండి, రాయలవైఖరి యంతయు గని పెట్టి 'ఎప్పుడూ లేదు. చివరికి గజపతితనయ మిమ్మలను చంప బ్రయత్నించినప్పుడుకూడా—' అంటూండగానే 'చూడండి. ఎంత గర్వమో' అని యొక ఉత్తరాన్ని త్రిమ్మరుసుకు యిచ్చాడు రాయలు.

'ఎంత గర్వము! జవాబువ్రాయుపద్ధతి యిదియేనా!' అని త్రిమ్మరుసు ఉత్తరం చదవకమునుపే మళ్లా అన్నాడు రాయలు. ఉత్తరమును చదువుట ముగించి 'ఏమున్నది? సైన్యమును సిద్ధముకావింతము' అన్నాడు త్రిమ్మరుసు.

'ఎన్నిరోజు లవుతుంది.?'

'ఆలస్యమునకు కారణము లేదు. అన్నీ సిద్ధముగానే ఉన్నాయి. సామంతులకు వార్తనంపుటయే యాలస్యము.'

'ఆదిలుశాహా నీతడవ పాదాక్రాంతునిచెయ్యాలి. గుఱ్ఱముల నమ్మవానికోస మింత—'

'రహస్య మదిగాదు. వానికిగూడ మనతో డీకొని, ఒకచెయ్యి చూడాలనని ఉంది. సయ్యాన్ మర్కా రొకకారణము. అంతే.'......

'ఏక క్రియా ద్వ్యర్థకరీ — రాయచూరు లాక్కోడానికి మనకి యిదొకకారణము కదా.'

'చిత్తము. సామంతు లందరికీ ఫర్మానాలు పంపుదునా?'

'అవశ్యము.'

సెలవుదీసికొని త్రిమ్మరుసు వెళ్లిపోయాడు. ఆదినమున రాయలు స్వయంగా విజయనగరములో వున్న సైన్యాన్ని పరీక్షించాడు.

రాయల ప్రయాణవార్త అంతఃపురంలోకి వ్యాపించింది. రాయలకి చిన్నాదేవి ముద్దులభార్య. ఆమె చెప్పినమాట రాయ లెన్నడూ త్రోసివేయలేదు. అలాగని ఆమె యెన్నడూ అనవసరపుప్రసంగాలు రాయల వద్ద యెత్తలేదు. ఆమె యిప్పుడు గర్భిణి. ఎప్పుడూ లేని సంగతి—ఆమెహూడా రాయలతోయుద్ధానికి బయలుదేర్తానని పట్టుపట్టింది.

'ఉత్తప్పుడుఅయితే భయంలేదు. కడుపులో పిండంజాగ్రత్తకోసమేనా యింట్లో వుండు' అన్నాడు రాయలు.

'రాయలవారి భార్య అంతపిరికిదనా మీఅభిప్రాయం? నేను భయపడితేకదా పిండం అదరటానికి—అదిగాక యిలాటియుద్ధాలు చూస్తేకాని వీరమాతను కావడ మెలాగ? మీతల్లి చలవన వీరపత్నిని అయినానుగాని—' అంది చలించకుండా చిన్నాదేవి. నిజమే, ఆమె చిన్నతనంలో తండ్రితోటి ప్రతిదండయాత్రలోనూ బయలుదేరేది. కడుపులో ఉన్న బిడ్డయొక్క తేజంగూడా కలవగా ప్రజ్వరిల్లుతున్న ఆకళ్లనీ, పాలుగారుతున్న ఆచెక్కిళ్లనీ, హృదయాన్ని నొక్కిపట్టే ఆపలుకులనీ చూసి రాయలు ఆమెమాటకి కాదనలేకపోయాడు. చిన్నమదేవి రాయలతో బయలుదేరు ననువార్త విజయనగరమంతా పాకింది. ఎవరికి తోచినట్లు వాళ్లు తలోమాటా అన్నారు. లోకాన్ని ఎవరు ఆజ్ఞాపించగలరు! అప్పాజీని బిలిపించి రాయలు 'ఏమంటార'ని అడుగగా 'ఆమె కంతయభిలాష యుండగా వలదననేల' అన్నాడు అప్పాజీ. దాంతోటి దారి

నిష్కంటక మైంది. ప్రొద్దుగూకేవేళ చిన్నాదేవియంతః పురమువద్ద నొకబండి ఆగింది. ముక్తాంబవసంతలిద్దరూ దిగి లోపలికివెళ్లారు. ముక్తాంబకంటె చిన్నాదేవి రెండేండ్లు పెద్ద. కాపురమునకు వచ్చినదిమొదలు చిన్నాదేవి ముక్తాంబతో స్నేహము మొదలిడింది. ఇద్దరి స్నేహమూ బాగా వృద్ధి అయింది.

'మీరుకూడా ఆదిల్‌శాహోమీదికి యుద్ధానికి వెడతారని—' అని ముక్తాంబ నవ్వుతూ అంటూండగానే 'అవును' సత్యభామవలె' అని చిన్నాదేవి పకాలున నవ్వింది.

'సరిసరి. పేర్లు సరిపోయాయి. ఆయన శ్రీకృష్ణుడే' అని ముక్తాంబ అంది.

'అమ్మ' మా ముక్తాంబకికూడా వొకఅర్జునుణ్ణో, అనిరుద్ధుడినో చూడండమ్మ' అని వసంత పలికింది.

'వసంతా' నీకు బొత్తిగా భయము లేకుండబోయింది' అని ముక్తాంబ లేనికోపము తెచ్చుకొని అనగా 'అవునవును. యుద్ధానికి వెళ్లివచ్చినతరువాత రాయలవారితో చెప్పి ఆలోచించాలి యీవిషయం'అని చిన్నాదేవి పలికి ముక్తాంబను చూసి 'ముక్తా, ఎవరినైనా ఏర్పాటుచేసుకున్నావా యేమిటి చెప్పు.' అంది.

'మీరుగూడా అలాగే అంటున్నారా? మా వసంతకి భయం లేదు.'

'నాకూ భయం లేదు.'

'ఎంతమాట? నేనుకూడా మీతోటి రావాలనివుంది యుద్ధానికి.'

'అవును. అలా అనుకుంటూనే ఉన్నాను. మీతండ్రి యేమనునో?'

'మీరు అడిగితే యింక అడ్డు ఉండదు.'

'చూద్దాం.'

ఇకనేమి? రాయలవారి దేవి యడుగుటయు, లేదని మాట వచ్చుటయునా! ముక్తాంబకూడా సిద్ధమైంది. ముక్తాంబప్రయాణంసంగతిమాత్రం రహస్యంగా ఉంచారు.

౫

వాళ్లు మళ్లా కలిసికొన్నారు. రామచంద్రుడు తాను రాయమారుయుద్ధానికి పోతూన్నట్టు తెలియజేశాడు. ముక్తాంబ తన ప్రయాణంమాట చెప్పలేదు. మూడోనాడే ప్రయాణం. ఇద్దరూ వొకరినొకరు చల్లగా నోటివెంట మాటలేకుండా చూచుకున్నారు. రామచంద్రుడు లేచి తన రెండుచేతులతో నామెతలను బట్టుకొని వెనుకకు వంచి పెదవులపై ముద్దుపెట్టుకున్నాడు.

'యుద్ధానికి వెళ్లుతున్నాను. మళ్లా మనయిద్దరమూ—యేమో'

'అలాంటిమాటలు ఎందుకూ, శుభమా అని?'

'ఇలా చూడు.'

'ఏమిటి?'

'........................'

ఒకటి, రెండు, మూడు,..............వంద—

ఒకరినొకరు కౌగిలించుకున్నారు.

ఆనందాశ్రువులతో, ఆలింగనములతో, పరస్పర క్షేమాభిలాషలతో విడువలేక విడువలేక, యిదియే కడసారియా అన్నట్టు ఒకరినొకరు వీడ్కొన్నారు.

౬

ప్రచండసేనావాహినితో బయలుదేరాడు రాయలు. విజయనగరమంతా కంపించిపోయింది రణభేరీలతో. ఇంటింటా వీరాలాపములు మారుమ్రోగుతున్నాయి. విజయనగరములో ఓమూల కాపురమున్న కొద్ది మహమ్మదీయులు తహతహలాడిపోతున్నారు, తనుమీద ఏం విరుచుకుపడుతుందో అని. గోపాలరాజునకు రాయలు తగువిషయములను దెల్పి 'జాగ్రత్త' అన్నాడు. ఆమహమ్మదీయుల పేటచుట్టూ ఒపెద్దసేన కాపు ఉంచబడింది. పురవాసులంతా 'రాయలకు జయ మగుగాక' అని కేకలేస్తున్నారు. ఎక్కడజూసినా సందడే. ఊరుదాటినదాకా ప్రతివారికీ యేదో ఒకఆజ్ఞని ప్రసాదిస్తూ, ఎక్కడజూసినా తనే యైయున్నాడు త్రిమ్మరుసు మంత్రి. రాయలు భద్రగజము నెక్కాడు. ప్రక్కన

పల్లకీలలో చిన్నాదేవి, ముక్తాంబ మొదలగు స్త్రీజన మంతా బయలుదేరారు. ఒక్కగడియలో నగరమంతా వానకురిసి వెలిసినట్టయింది.

కృష్ణానదియొడ్డున విడిసి రాయచూరు నతికష్టము మీద లోబరచుకొన్నారు. ఆదిల్ శాహా యెత్తివచ్చు చున్నాడన్నవార్త రాయలచెవి సోకింది. సైన్యమంతా అతిజాగ్రత్తగా వుంది. తెలతెలవారుచుండెను. పక్షులకల కలంతో, సైనికులుగూడ కలకలలాడుచు మేల్కొనిరి.

'వచ్చె వచ్చె' అను కేకలతో అందరూ సిద్ధమయారు. అరగడియలో ఒకసైన్యము వచ్చి వారిని తలపడింది. ఆదిల్ శాహాయే! నెత్తురు చుక్కలు చుక్కలుగా పడుతోంది భూమిమీద. ఆచుక్కలతోటి నేలంతా తడిసింది; మడుగు గట్టింది. ఓమడుగుకు యింకోమడుగు కలసి కాలువ గట్టింది. కృష్ణానదిలో రక్తపు కాలువలుగూడ కలుస్తున్నాయి.

రామచంద్రుడు విసుగులేకుండా పోరుతున్నాడు. పది,— యిరువది,— సాయెబులు పడుతున్నారు. ఇదంతా చూశాడు ఒకడు ప్రక్కనించి. ఒక్కరామచంద్రుడు తమసేనలోనివారిని యింతమందిని—వాడికి కడుపుమండిపోయింది. వెనకనించి వచ్చి, యింకొకడితో పోరుతున్న సమయాన, రామచంద్రుని మెడమీద కత్తితో కొట్టాడు. రామచంద్రుడు క్రిందబడ్డాడు. అతనితోటిపాటే ఆతురక క్రిందబడ్డాడు. వెంటనే రామచంద్రునితోటి పోరుతున్నవాడు క్రిందపడ్డాడు.

రామచంద్రునితలతనతొడపైబెట్టుకొని ముక్తాంబ కూచునివుంది. మెడలోని రక్తనాళము తెగిపోయింది. రక్తముతో ముక్తాంబతొడంతా తడిసిపోతోంది.

రామచంద్రుడు కన్నులొకసారి విప్పి, ఆశ్చర్యాయాసములతో 'ఏ—లా—వ-చ్చా-వ్—' అన్నాడు. 'మీరు నన్ను బ్రతికించారుకాని నేను మిమ్ములను బ్రతికించుకోలేకపోయాను' ముక్తాంబకి దుఃఖ మాగలేదు. కనులు మూసి మరల తెరిచి, మెడ రెండుసారులటునిటు తిప్పి మరల కన్నులు మూశాడు రామచంద్రుడు. అంతే.

ప్రక్కనున్న కత్తితీసుకొని, రెండుసారులు రామచంద్రుని ముద్దాడి, రొమ్ముల్లో పొడుచుకుంది ముక్తాంబ.

ఇలాంటివి యెన్నయామో ఆంధ్రదేశంలో!